క్లుప్తంగా

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్



వరంగల్ క్రైం : ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. శ్రీధర్‌రావు గురువారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ప్రజలకు పోలీసుల పట్ల ఉన్న నమ్మకానికి తగ్గట్లుగా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

నయీంనగర్ : సమాచార హక్కు చట్టం సాధన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 12న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. కమిటీ జాతీయ, రాష్ట్ర నాయకులు మల్లం వెంకటేష్ గౌడ్, స్రవంతి, గోపినాథ్, మీసాల విజయ్ పాల్గొన్నారు.

కరపత్రం..

ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లోని శ్రీసత్యనారాయణ దేవాలయం వద్ద గురువారం కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామితో కలిసి సామాజిక వేత్త మేరుగు అశోక్ జమ్మిపూజ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సత్యనారాయణ గుడి వద్ద జమ్మిపూజ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని, భక్తులు హాజరై జమ్మి ఆకును స్వీకరించాలని అశోక్ కోరారు.35వ డివిజన్ పద్మశాలి అధ్యక్షుడు గడ్డం రవి, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్, భాగ్యమ్మ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కేశవ్, అఖిల్ పాల్గొన్నారు

నియామకం



వెంకటేశ్వర్లు

రామన్నపేట : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమ నిర్వహణ కమిటీ వైస్ చైర్మన్‌గా వరంగల్‌కు చెందిన చిప్ప వెంకటేశ్వర్లును నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 56 మందితో నిర్వహణ కమిటీని ఏర్పాటు చేస్తూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ నెల 27న ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే అధికారిక జయంతి ఏర్పాట్లను పర్యవేక్షించడం ,కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బాధ్యతలు అప్పగించిందన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యారణ్యపురి : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా గురువారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు సంధ్యారాణి, సువర్ణ, జ్యోతి, రాకేష్, వలంటీర్ బానోత్ వీరన్న పాల్గొన్నారు. క్విజ్‌పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మెటర్నిటీ ఆస్పత్రి కలేనా?

- నామమాత్రంగా డిస్పెన్సరీ సేవలు
- ప్రారంభం కాని 30 పడకల హాస్పటల్





కాజీపేటలోని ప్రభుత్వ సివిల్ డిస్పెన్సరీ

కాజీపేట : కాజీపేటలోని గ్రేటర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో పుష్కర కాలం కింద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీ పనితీరు నామమాత్రంగా తయారైంది. దీంతో నిత్యం రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంతో పాటు విలీన గ్రామాలు, చుట్టూపక్కల మండలాల్లోని దాదాపు 2లక్షల మంది ప్రజలకు వైద్యసేవలు అందించే లక్ష్యంతో డిస్పెన్సరీని 30 పడకలకు పెంచాలనే ఆలోచన చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఈ డిస్పెన్సరీని 30 పడకల మెటర్నిటీ ఆస్పత్రిగా విస్తరించాలనే లక్ష్యంతో భూమిపూజ నిర్వహించారు. కాజీపేట పట్టణంలో ఇక మెటర్నిటీ ఆస్పత్రి ఏర్పటైనట్లేనని ప్రజలు భావిస్తున్న తరుణంలో ఏమి జరిగిందో ఏమో.. ఫైలు ముందుకు కదలడం లేదు. ఈ డిస్పెన్సరీ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల ఆశలు కలగానే మిగిలిపోయాయి.

వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి నగర మేయర్ విజ్ఞప్తి మేరకు 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేసి రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారు. మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న భవనాల్లో ఈ నిధులను ఉపయోగించి ఆస్పత్రికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. మరో వారం రోజుల్లో సీఎం చేతుల మీదుగా ఆస్పత్రిని ప్రారంభించాలనే ఉద్దేశంతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. కాగా సీఎం హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆస్పత్రి ఏర్పాటు నిలిచిపోయింది. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మెటర్నిటీ ఆస్పత్రి కోసం ప్రయత్నాలు ప్రారంభించి వదిలేయడంతో అటకెక్కినట్లయ్యి కథ మళ్లీ మొదటికే వచ్చింది.

డిస్పెన్సరీలో వైద్యసేవలు కరువు..

మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలోని డిస్పెన్సరీ రోగులకు సరైన వైద్య సేవలు అందించలేకపోతుంది. డాక్టర్‌తో పాటు పలువురు వైద్య సిబ్బంది ఉన్న ఫలితం లేకుండాపోతుంది. మధ్యాహ్నం 2 గంటల వరకే డిస్పెన్సరీ పనిచేస్తుంది. అసలు డిస్పెన్సరీ ఉన్నట్లు కూడా సగం మందికి తెలియని పరిస్థితి.

ఎమ్మెల్యేపైనే ఆశలు..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపైనే పట్టణ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పట్టణానికి మెటర్నిటీ ఆస్పత్రి వస్తుందనే ఆశలు అడుగంటిన వేళ కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆస్పత్రి మంజూరుకి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

మెటర్నిటీ ఆస్పత్రిని ప్రారంభించాలి



కాజీపేట పట్టణంలో మెటర్నిటీ ఆస్పత్రిని ప్రారంభించాలి. ఎంతో కాలంగా ఈ ప్రాంత ప్రజలు ఆస్పత్రి కోసం ఎదురు చూస్తున్నారు. స్థానికంగా ఆస్పత్రి లేకపోవడంతో హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు మహిళలు వెళ్లి రావడం కష్టంగా మారింది.

- బొడ్డు కరియప్ప, ధర్మసాగర్

30 పడకలకు ఆస్పత్రిని విస్తరించాలి..



కాజీపేట పట్టణంలో వెంటనే 30 పడకల మెటర్నిటీ ఆస్పత్రి ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం డిస్పెన్సరీ ఉన్న భవనాల్లో ఆస్పత్రిని ప్రారంభిస్తే వివిధ గ్రామాల ప్రజలతో పాటు పట్టణవాసులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మహిళలకు కాన్పు కష్టాలు తప్పుతాయి.

- దావా సుధాకర్, కాజీపేట

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

న్యూశాయంపేట: త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు గురువారం కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తూ విధులను నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పూర్తి పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. నోటిఫికేషన్ జారీ నుంచి మొదలు కౌంటింగ్ వరకు సమస్యలు కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డిప్యూటీ సీఈఓ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్‌రావు, జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ ఫార్మసిస్టులదే



మామునూరు: సమావేశంలో మాట్లాడుతున్న వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ కమల్‌యాదవ్



హన్మకొండ కల్చరల్: ఫార్మసిస్ట్ భిక్షపతిని సన్మానిస్తున్న డాక్టర్ శరవణభవ, అధ్యాపకులు

మామునూరు /హన్మకొండ కల్చరల్ : భవిష్యత్ మొత్తం ఫార్మసిస్టుల దేనని, ఫార్మసిస్టులు కేవలం ఔషధ సరఫరా దారులుగానే కాకుండా, రోగుల ఆరోగ్య రక్షణలో కీలక భాగస్వాములుగా మారాలని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్స్ సూచించారు. వరంగల్ బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో, హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మాసీ కళాశాలలో గురువారం 'వరల్డ్ ఫార్మసిస్ట్ డే' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమల్ యాదవ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. వాగ్దేవి కళాశాల ఫార్మాడీ హెచ్ఓడీ డాక్టర్ బీఎస్ శరవణభవ, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఓడీలు వెంకటేశ్వర్లు, శ్రవణ్‌కుమార్, కుమారస్వామి, మహేష్, ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్ యాదవ్, డాక్టర్ చంద్రప్రకాశ్, బస్వరాజ్ డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పండుగలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న హరి రమాదేవి

హన్మకొండ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పండుగలకు ప్రాధాన్యత ఇచ్చిందని ఆపార్టీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హరి రమాదేవి తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలు కూడా పండుగలు సంతోషంగా నిర్వహించేందుకు కానుకలు ఇచ్చారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాధాన్యత కల్పించారన్నారు. ఈ నెల 28న హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంబురాల్లో జిల్లాలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళ నాయకులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

- రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య



మాట్లాడుతున్న నర్సయ్య

కేయూ క్యాంపస్ : వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య కోరారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి, గోపాలపురం పక్షాన 2007 తల్లిదండ్రుల వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం నియమావళి 2011ను అనుసరించి గురువారం కేయూలోని సెమినార్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధుల ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించేందుకుగాను ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధమిత్ర, స్వచ్ఛంద కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా పరిష్కరించవచ్చని అన్నారు. సామాజికంగా, ఆరోగ్యపరంగా అనేక కుటుంబాల్లో వృద్ధులు తమ కుటుంబాల్లో సమస్యలను ఎదుర్కొనలేక, వేధింపులు భరించలేక నిరాదరణకు గురవుతు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ శిక్షణకు ముఖ్యఅతిథిగా అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వృద్ధుల సమస్యలపై చురుకుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.వృద్ధమిత్ర విధివిధానాలు కూడా అమలుచేయడం ద్వారా వృద్ధులకు న్యాయం జరుగనుందన్నారు. ఆ సంస్థ కార్యదర్శి తేరాల యుగేందర్, బాధ్యులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ జయంతి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 26న ఉదయం 10గంటలకు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం గురువారం సర్క్యులర్ జారీ చేశారని బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగ సతీష్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

వర్షపు జల్లులకు జనజీవనం అస్తవ్యస్తం




కాజీపేట పట్టణానికి ఎగువన ఉన్న చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి.

కాజీపేట : కాజీపేట పట్టణంలో బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాపు జల్లులతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఓ మోస్తరుగానే వర్షం జల్లులు పడుతుండడంతో చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు అనేక ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పలు కాలనీలవాసులు ఇబ్బందులు పడ్డారు. డిజిల్ కాలనీ ప్రధాన రహదారిపై వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

గడ్డం సమ్మయ్యకు సన్మానం

ఖిలా వరంగల్ : స్వచ్ఛ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో పద్మశ్రీ ఆవార్డు గ్రహిత గడ్డం సమ్మయ్యకు కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం షీల్డ్ అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ వలంటీర్స్, ప్రోగ్రాం ఆఫీసర్లు, పర్యాటక శాఖ గైడ్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



కుష్మాండ అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

హన్మకొండ అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి ఆలయంలో నాలుగో రోజు గురువారం పద్మాక్షి అమ్మవారు కుష్మాండ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ పండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఉదయం అమ్మవారికి షోడశ కలశాలతో పంచకాలకాలతో అభిషేకం నిర్వహించి అలంకరించినట్లు, చండీ హోమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాతలు సుంకరి సురేందర్, బత్తుల శ్రీనివాస్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి రూపంలో శ్రీలలితాదేవి..



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీలలితాదేవిని మహాలక్ష్మి రూపంలో అలంకరించారు. రూ.లక్ష కరెన్సీతో గురువారం లలితాదేవిని మహలక్ష్మిని అలంకరించగా.. భక్తుల అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వొడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేశ్, అడెపు శ్యాం, రావికంటి అశోక్, కడికాల సుధాకర్ పాల్గొన్నారు.

త్రిమూర్తినిత్యగా శ్రీరాజరాజేశ్వరీదేవి..



హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు త్రిమూర్తినిత్యగా అలంకరించి పూజలు చేశారు.

దుర్గామాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు

కాజీపేట : కాజీపేట పట్టణంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని గురువారం రాత్రి పుర వీధుల్లో భక్తులు ఊరేగించారు. వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ తీశారు.

భద్రకాళి అమ్మవారికి సూర్యప్రభ, హంస వాహనసేవలు





సూర్యప్రభ, హంసవాహనంపై..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం భద్రకాళి అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు శేషు ఆధ్వర్యంలో నిత్యాహ్నికం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని కూష్మాండీని క్రమంలో దుర్గార్చన జరిపి సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం గిరిజాక్రమంలో దుర్గార్చన చేసి హంసవాహన సేవ నిర్వహించారు. దేవాలయానికి తైలవర్ణాలంకరణ చేసిన దాత కుందూరు వినయ్ నారాయణరెడ్డి దంపతులు, జనగామ ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ రామల సునీత పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

హసన్‌పర్తి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు భక్తులు విశేష పూజలు చేశారు. ఒకటో డివిజన్ ముచ్చర్లలో జరిగిన కార్యక్రమంలో జనతా యూత్ క్లబ్ సభ్యులు సూర ప్రమోద్, రాజేష్, హరిప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో మహా మృత్యుంజయ హోమం

రామన్నపేట: నగరంలోని శృంగేరి శంకరమఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజు శారదా దేవికి పూజలు చేసిన ప్రత్యేకంగా అలంకరించినట్లు ప్రధానార్చకులు సంగేమేశ్వర జోషి తెలిపారు. దాతలు పుల్లూరి దేవేందర్-పద్మ దంపతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు.

మహాఅన్నదానం

మడికొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ మడికొండలో రావణ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిట్ట కన్నయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నదానం చేశారు.

కాజీపేట: ఎఫ్‌సీఐలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



నిట్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



హసన్‌పర్తి: సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో..





ఘనంగా బతుకమ్మ సంబురాలు



కాజీపేట అర్బన్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నిట్ విద్యార్థినులు

కాజీపేట : కాజీపేటలోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆవరణలో గురువారం మహిళ ఉద్యోగులు బతుకమ్మ ఆడిపాడి ఉత్సాహంగా గడిపారు. డివిజనల్ మేనేజర్ ప్రఖార్ వర్మ, ఏజీఎం ఇందు, మేనేజర్లు దివ్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డిలో..

హసన్‌పర్తి : అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థినులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, డాక్టర్ వాణిశ్రీ, రజిత, కార్యక్రమ సమన్వయకర్తలు పావని, పి.సుచరిత, ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో..

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ క్యాంపస్‌లో గురువారం విద్యార్థినులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని రాబోయే తరాలకు తెలిపేందుకు నిట్ వరంగల్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. విద్యార్థినులు వివిధ రకాల పుష్పాలతో అందమైన బతుకమ్మలను పేర్చి, కోలాటాలతో ఆడిపాడారు.

బీరన్న గుడి వద్ద..

ఖిలా వరంగల్ : కరీమాబాద్‌లోని బీరన్న గుడిలో గొల్లకురుమ మహిళలు బతుకమ్మలతో చేరుకుని బతుకమ్మ ఆటలు ఆడారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి హాజరై బతుకమ్మ సంబురాలను ప్రారంభించి మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు.

శాస్త్రమిత్ర ఆధ్వర్యంలో ఆంధ్రాలో వేడుకలు

నయీంనగర్ : ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా బాపట్ల సూర్యలంక బీచ్‌లో శాస్త్రమిత్ర సభ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయ బృందంతో ఏర్పడిన శాస్త్రమిత్ర స్టడీ సర్కిల్ సభ్యులు చారిత్రక, వైజ్ఞానిక, సాంస్కృతిక జ్ఞానార్జనకై చేస్తున్న స్టడీ టూర్‌లో భాగంగా సూర్యలంక బీచ్‌లో మహిళా సభ్యులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.



న్యూశాయంపేట: పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో..




సీడీసీలో బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు

రాములుకు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు



విద్యారణ్యపురి : హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడు సీహెచ్ రాములకు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. గురువారం హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్‌లోని భాస్కరా ఆడిటోరియంలో నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు-2025ను శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ అందజేసింది. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్‌ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, ఎమ్మెల్సీ మాల్క కొమురయ్య పాల్గొని రాములుకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాములును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పట్నం కమలమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



హసన్‌పర్తి : వరంగల్ కలెక్టర్ సత్యశారదను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరామర్శించారు. ఇటీవల కలెక్టర్ అత్తమ్మ మృతిచెందిన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం హైదరాబాద్‌లోని కలెక్టర్ నివాసానికి వెళ్లారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

రైతుల సమస్యలు పరిష్కరించాలి



న్యూశాయంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ కలెక్టరేట్ వద్ద వర్షంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోనె కుమారస్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుసుం బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్, నాగెల్లి కొంరయ్య, గోనె రాంచందర్, మహ్మద్ రాజా సహేబ్, కుమారస్వామి, మొగిలి, రాజమల్లు, వెంకటస్వామి, రాజేందర్ పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాకు జేఎస్‌జేబీ అవార్డు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాకు జల్ సంచ్ అండ్ జన్‌భగీ (జేఎస్‌జేబీ)అవార్డుతోపాటు రూ.కోటి బహుమతి దక్కింది. ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ గురువారం సాయంత్రం ప్రకటించింది. జిల్లాలో భూగర్భ జలాల పెంపకం (సేద్యపు కుంటలు, ఇంకుడు గుంతలు, చెరువుల్లో పూడికతీత, చెక్ డ్యాం, మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్) పనులు చేపట్టిన నేపథ్యంలో అవార్డు దక్కినట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు నిరుపేద ఎస్సీ విద్యార్థుల నుంచి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి (స్కాలర్‌షిప్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి ప్రకటనలో పేర్కొన్నారు. రూ.20 లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నారు. www. telanganaepass. cgg.gov.inలో దరఖాస్తులకు నవంబర్ 19వ తేదీ వరకు గడువు ఉందన్నారు.